# ప్రైవేట్స్

ఎమ్. వి. యస్. సత్యనారాయణమూర్తి

రహాలరాజు బుర్ర గోక్కున్నాడు విచా రంగా. రెండు వెంట్రుకలు రాలాయి. [శ్ర]ద్ధంగా వాటిని శల్యపరీక్షచేసి టకీమని డిగాడు. "ఇవి నీవా? నావా? లేక మని ]వా?"

నాకు ఒళ్ళుమండింది. "అంట్లవెధవా! బుర్ర నీవు గోక్కుంటే నా వెంట్రుకలు ందుకు రాలుతాయి? నీవి రాలుతాయి ని."

"నిజమేననుకో, అయినా నీకూ డేం శఫ్ వుందికదా. నీవీ ఈ మధ్యన రాలు ]న్నాయి కదా అని."

వాడు చెప్పిందికూడా నిజమే. ఈ ]ధ్యన నాజుత్తుకూడా ఊడిపోతోంది. ]ట తప్పించాలని అన్నాను. "అయితే ]ేమను ప్రేమించటం మానవా?"

వాడుమళ్ళీ బుర్రగోక్కుందామని అను కున్నాడు గాని, మళ్ళీ వెంట్రుకలు రాల ]తాయేమోనని భయపడి మానేశాడు.

"ప్రేమను ప్రేమించటమేకాదు. ఆరా ]ధిస్తున్నాను. చివరికి ప్రాణంకూడా ఇస్తాను."

"ఒక పెన్ అప్పివ్వగలవురా?" ఆశగా అడిగాను.

"ప్రాణం ఇవ్వగలనుగాని అప్పివ్వ లేను. కావాలంటే నాతల ఇస్తాను తాకట్టు పెట్టుకో" తాపీగా అన్నాడు సిగరెట్ వెలి గించి.

"పోనీ ప్రేమతో డైరెక్టుగా చెప్పేయ్"

"భయం"

"పిరికి సన్యాసీ! ఒకపది అప్పివ్వలేవు ధైర్యంగా మాట్లాడలేవు. నీ కెందుకురా ప్రేమ?"

సన్యాసిరావు ఆవులిస్తూ వచ్చాడు. "పిలిచావా గురూ!" అంటూ.

వాడిని లోపలికి పంపేసి అన్నాను. "మాట్లాడవే(?"

"ప్రేమా, దోమా అనితిట్టకు. నాది అమరప్రేమ" సినిమా డైలాగ్ చెప్పాడు వున్నట్టుండి 'అమర ప్రేమకి జై' అన్నాడు పిచ్చిపట్టినట్లు.

"ప్రేమ ఇంటిపేరు 'కె' కదరా. 'అమర' అని మార్చేసుకుందా?"

వాడికి అర్థంకాలేదు. "చూడు రామ

నాథం...."

"నాపేరు వరహాలరాజు, రామనాథం కాదు."

నాకు చిరాకు వేసింది. "నేను చెప్పింది వింటావా! వినవా?"

"చెప్పు!"

రూంలో గ్రీస్ అనాటమీ పుస్తకాన్ని తలగడగా పెట్టుకొని రాగాలు తీస్తున్న ప్రసాద్ చప్పునలేచి చెప్పు తీసుకుని వచ్చేడు మా ఇద్దరిమధ్యకీ.

"చెప్పెందుకు తెచ్చావురా?" అడిగాను ఎందుకు తెచ్చాడో అర్థంకాక.

"చెప్పు అని వరహాలుగాడు అడిగాడుగా. అందుకు తెచ్చాను."

వాడి చెప్పుని అవతలకి గిరవాటేసి, వాడిని బయటకు గెంటేసి తలుపు వేసేసాను.

"నేను చెప్పేది వింటావా?"

వాడు ఏలోకంలో వున్నాడో, మళ్ళీ అన్నాడు "చెప్పు."


ప్రసాద్ కిటికీలోంచి చూస్తూ, "చెప్పిదిగో" అని అరిచాడు చెప్పు ఆడిస్తూ.


కిటికీ మూసేసి అన్నాను "ప్రేమను డైరెక్ట్‌గా ఎప్రోచ్ అవ్వు. అదేబెస్ట్."

"అంతే నంటావా?"

"అంతే!"

రెండురోజులు గడిచాయి.





ఆరోజు ఉదయం క్లినిక్స్ అయిన తరువాత ప్రేమ హాస్టల్‌కు వెళ్తూంటే వరహాలరాజు పిలిచాడు.

ప్రేమ తిరిగిచూసింది.

వరహాలరాజు ధైర్యంగా అన్నాడు. "మీతో ఒక్కవిషయం మాట్లాడాలి."

ప్రేమ ఆశ్చర్యంతో తడిపి, చిన్నగా నవ్వి అంది. "చెప్పండి త్వరగా హాస్టల్‌కు వెళ్ళి చదువుకోవాలి."

"మిమ్మల్ని ప్రేమిస్తున్నాను ప్రేమా" అనేసి భయంతో కాసేపు వణికి, దిక్కులు చూడసాగాడు వరహాలరాజు.

ప్రేమ నవ్వింది. ప్రేమ నవ్వుకు ముందున వెళ్తున్న అమ్మాయిలు వెనక్కితిరిగి చూశారు. నవ్వినవ్వి కాసేపు అలిసిపోయింది.

"చాలాపాత డైలాగ్ సార్ మీరు చెప్పింది, మీ మొహంలాగే చాలా మాసిపోయింది. చూడండి వరహాలుగారూ?"

వరహాలరాజు ఆశగా చూశాడు ఆమె వేపు.

"చూడమంటే నావేపు చూడమనిగాదు మీకు ఎనాటమీలో గోల్డుమెడల్ వచ్చిందా"

"..........."


"పోనీ ఫిజియాలజీలో.........కనీసం ఫార్మ్‌కాలేజీలోనైనా మెడల్ వచ్చిందా?"

"గోల్డుమెడల్స్ లేవుగాని మీకు కావాలంటే అప్పుచేసయినా సరే రోల్డుగోల్డువి కావలసినన్ని మెడల్సు కొంటాను."

ప్రేమ బిగ్గరగా నవ్వింది. ప్రక్కనున్న భవనగర్ వార్డులోని పేషెంట్లు ఉలిక్కిపడ్డారు.

"అవికావు రాజుగారూ, నాకు నిజమైన మెడల్సుకావాలి. నాభర్త మిలట్రీ ఆఫీసర్లా భుజంచుట్టూ మెడల్సు తగిలించుకోవాలి. మీకా సామర్థ్యం వుందా?" అని ప్రేమ ముందుకు వెళ్ళిపోయింది.

* * *




వరహాలురాజు విచారంగా ఎలక్ట్రిక్ పోల్‌లా నిలబడ్డాడు.

ప్రేమ గర్వానికి నాకు ఒళ్ళుమండింది. ప్రేమకి గర్వభంగం చెయ్యాలనిపించింది. ఒక పథకం ఆలోచించి, చెయ్యవలసింది వాడికి చెప్పాను.

ఆరోజు ఉదయం సూర్యుడు ఎనిమిక్ పేషెంటులా డల్‌గా వున్నాడు.

వరహాలరాజు ప్రిన్స్‌పాల్ రూంలోకి అడుగుపెట్టి నిలబడివున్నాడు ద్వారపాలకుడిలాగ. ప్రిన్స్‌పాల్ తలెత్తకుండా వ్రాసేసు కుంటున్నాడు.

"చూడండి సార్...."

ప్రిన్సిపాల్ చూశాడు.

"మీరు నా మర్యాద, గౌరవాన్ని కాపాడాలి."

ప్రిన్స్‌పాల్ గలగలా నవ్వి. నీకు మర్యాద గౌరవం వుండి ఏడిచాయా అన్నట్లుగా చూసి "వాటికేమయిందీ" అన్నాడు.

"ప్రేమ అనే ఫైనలియర్ స్టూడెంట్ నేను ఆమెను నిరాకరించానని, మా పేర్లతో వెడ్డింగ్ కార్డ్సు ప్రింట్‌చేయించి అందరికీ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది సార్."

ప్రిన్స్‌పాల్ ప్రక్కన బాంబు పడినట్లు అదిరి పడ్డాడు.

"వ్వాట్!"

"అవునుసార్ మీమీద ఒట్టు."

"వెడ్డింగ్ కార్డేదీ?"

"నాకివ్వలేదు సార్. ఇస్తే మీకిస్తాను"

"సరే నువ్వెళ్ళు. చూస్తాలే" అని ఫైలు ముందుకు లాక్కున్నాడు.

వారం రోజుల తరువాత రాజు వెడ్డింగ్ కార్డు తీసుకువెళ్ళి ప్రిన్స్‌పాల్ ముందుంచాడు.

ప్రిన్స్‌పాల్ పాతసంగతులు మరిచిపోయి "హి....హి....పెళ్ళా? సంతోషం"

అన్నాడు నవ్వి.

వరహాలరాజుకి మండిపోయింది. జరిగింది టూకీగా చెప్పాడు. "ఈ వెడ్డింగ్ కార్డ్ ప్రేమ బాగ్‌లోవుంటే, దొంగతనంగా బేగ్ కొట్టేసి సంపాదించాను సార్."

ప్రిన్స్‌పాల్ ప్యూన్ని పిలిచి ప్రేమను పిలుచుకు రమ్మన్నాడు.

కాసేపటికి ప్రేమ వచ్చింది.

"ఏమమ్మా! ఇది నీ బేగేనా?" అని అన్నాడు హేండ్ బేగ్ చేత్తోపట్టుకుని.

"అవునుసార్ నాదే. క్లాసులో నా ప్రక్కన పెట్టుకుంటే ఎవడో దొంగవెధవ పట్టుకెళ్ళిపోయాడు" అంది రాజువేపు కోపంగాచూస్తూ.

"నువ్వు ఇలాంటి దానివనుకోలేదు. నువ్వు రాజుకి క్షమాపణ చెప్పుకోవాలి."

ప్రేమకి అర్థం కాలేదు. "ఎందుకు సార్, నేనేం తప్పుచేసానని."

ప్రిన్సిపాల్ ప్రేమమీద వెడ్డింగ్‌కార్డ్ గిరవాటేసాడు. ప్రేమ అది చదివి, వరహాలరావువేపు అనుమానంగా చూసింది. వరహాలరాజు మెలికలు తిరిగిపోతున్నాడు.

రాజు తన వెనకపడి మేరేజి ప్రోపోజల్స్ చేయడం, తను నిరాకరించడం అవీ చెప్పింది ప్రిన్సిపాల్‌కి. ప్రిన్సిపాల్ మొదట్లో నమ్మలేదు కాని రాజు ప్రవర్తన చూసి నమ్మేడు. రాజుమీద మండిపడుతూ "మొదటి తప్పుగా నిన్ను వదిలేస్తున్నాను. ఇలాంటి పన్లు మళ్ళీ చేస్తే..." రాజు సుడిగాలిలా బయటకు వెళ్ళిపోయాడు.

నా పథకం ఇలా బెడిసికొట్టుతుందను లేదు. నెలరోజులు గడిచిపోయాయి. ఈ నెలరోజులు వరహాలుగాడు అయిపులేడు. చచ్చిపోయాడేమోనని అనుమానం వేసి ప్రసాద్‌ని అడిగాను వాడి విషయం. వాడు ఒకరోజంతా వూరంతా తిరిగి రొప్పుకుంటూ వచ్చాడు.

"ఒరేయ్ సత్యం ... మన రాజు..."

"చచ్చిపోయాడా?" అన్నాను విచారంగా. "ఈ హిందూదేశంలో ప్రేమికుల జీవితాలు ఇంతేరా" అని బరువుగా నిట్టూర్చాను.

"ఛఛ వాడు చచ్చిపోలేదురా. బ్రతికే వున్నాడు. ఎక్కడో తెలుసా? మన కాలేజీ లైబ్రరీలో."

ఆశ్చర్యపోయాను. "మన లైబ్రరీలో పనిచెయ్యడానికి కొత్తగా ఏ అమ్మాయేనా చేరిందా?"

"కాదురా. మన వరహాలు మారిపోయాడురా. పూర్తిగా చెడిపోయాడు. రోజుకి పదహారు గంటలూ కూర్చుని చదివేస్తున్నాడొరేయ్!సమాధిలోకి వెళ్ళిపోయాడు."

వరహాలరాజుకి లవ్వైటీస్ అనే ఈ ప్రేమ రోగం వచ్చి ఇలా బాగుపడిపోతాడని కలలోకూడా అనుకోలేదు. పది సంవత్సరాల క్రిందట, అంటే నేను థర్డియర్‌లో రెగ్యులర్‌గా వున్నప్పుడు నేనూ అనుకున్నాను లైబ్రరీకి వెళ్దామని. కాని ఎప్పుడూ వెళ్ళలేదు. ఈమధ్య మధ్యాహ్నం పూట రూంలో గొడవగా వుంటే లైబ్రరీకి వెళ్ళి నిద్రపోతుంటాను. అంతేగాని చదవడానికని ఎప్పుడూ వెళ్ళలేదు.

ఫైనల్ ఇయర్ పరీక్షలు ఇంకో నెల రోజులున్నాయి. నన్ను, ప్రసాద్‌ని అన్ని పరీక్షలకీ 'డిబెయిన్' చేసారు.

ఆ రోజు ఉదయం ప్రసాద్ రేస్ గుర్రంలాగ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"ఈ విషయం విన్నావా?....వరహాల

రాజుకి మెడిసిన్ గోల్డ్ మెడల్ వచ్చింది "
" "

"సర్జరీ, గైనిక్ ప్రైజులకోసం, మన వరహం, ప్రేమ ఎగ్జామ్‌కు వెళ్ళారు కదా "

"ప్రేమకు ప్రైజ్ వచ్చిందా?" ఇంత రెస్టు లేకుండా అన్నాను.

"ప్రేమకి ప్రైజ్ వస్తే నేనెందుకు చెబుతాను? అవి రెండూ మన వరహం గాడికే ఇచ్చారట. అంతేకాదు మన గైనిక్ ప్రొఫెసర్ మన వరహాన్ని కౌగలించుకుని ఏడిచిందట."

"మధ్యన ఈవిడెందుకు ఏడవటం?"

"ఆవిడకి కూతుర్లేనందుకట. వుంటే వరహాలుగాడికే ఇచ్చి పెళ్ళిచేసేదట."

* * *

వారం రోజులు గడిచాయి.

నేను భవనగర్ వార్డు మెట్లు దిగుతూంటే కార్నర్‌లో ఎవరిమాటలో వినిపించాయి. వాళ్ళకు కనిపించకుండా కార్నర్‌కు వెళ్ళి వినసాగాను

వరహాలరాజు అంటున్నాడు "మీకు మెడిసిన్‌లో గోల్డు మెడల్ వచ్చిందా? కనీసం సర్జరీ గైనిక్? పోనీ ఎస్పీయమ్? ఎందులోనూ రాలేదుకదూ? అవును అవన్నీ మీకెలావస్తాయి? అవన్నీ నాకు వచ్చాయికదా? మిమ్మల్ని పెళ్ళి చేసుకోమని నన్నెలా అడుగుతున్నారు? నాక్కాబోయే భార్యకి మెడలో వుండవలసినవి నగలుకాదు.... మెడల్సు మె....డ....ల్సు...." చివరి మాటలు నొక్కి అన్నాడు.

"అంతేనా?" నెమ్మదిగా ఏడుస్తున్నట్లుగా అంది.

"అంతే!" వరహాలురాజు మహారాజులా ఠీవిగా వెళ్ళిపోయాడు. నేను ఆశ్చర్యంతో ముందుకు అడుగువేసి స్థాణువులా నిలబడిపోయాను. అక్కడ ప్రేమ విచారంగా ఒంటరిగా నిలబడి వుంది నీళ్ళు నిండిన కళ్ళతో. □


శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.



దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్యస్తంభన కలిగి హాయినిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నములు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం - రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్